క్లుప్తంగా...

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను అందజేస్తున్న చింతా జగ్జీవన్‌రామ్

జియాగూడ: రోడ్లపై నిద్రిస్తున్న నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు కార్వాన్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు చింతా జగ్జీవన్‌రామ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి చాదర్‌ఘాట్ సాయిబాబా మందిరం, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, పేట్లబుర్జు ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రి, ముస్లింజంగ్ భూలక్ష్మి టెంపుల్, వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. అనంతరం చింతా జగ్జీవన్‌రామ్ మాట్లాడుతూ..ప్రతి యేటా చలికాలంలో దుప్పట్లు అందజేస్తుంటానని తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే వారందరికీ చెక్కులు మంజూరవుతాయన్నారు. మరింత సమాచారం కోసం తన కార్యాలయంలో నేరుగా తనను గానీ, తన సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

మైనర్‌ను తీసుకెళ్లేందుకు సహకరించిన వ్యక్తి రిమాండ్

జియాగూడ: మైనర్ బాలికను తీసుకెళ్లడానికి స్నేహితుడికి సహకరించిన ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్, ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. గత నెల 30న పురానాపూల్ ప్రాంతంలో ఉప్పుగూడకు చెందిన ప్రవీణ్(21) బ్యాండ్‌వాయిస్తుంటాడు. ఇతడు ఓ మైనర్ బాలికను తీసుకువెళ్లడానికి సహకరించిన వనపర్తికి చెందిన కె.భానుప్రకాష్(21) సహకరించడంతో గురువారం వనపర్తిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రముఖ న్యాయవాది యాదయ్య జట్టి మృతి



యాదయ్య జట్టి (ఫైల్)

గోల్కొండ: ప్రముఖ న్యాయవాది, దళిత హక్కుల పోరాట యోధుడు యాదయ్య జట్టి(60) మృతి చెందాడు. గోల్కొండ బంజారి దర్వాజకు చెందిన ఆయన పేద బడుగు వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తూ సంఘ సేవకుడిగా గుర్తింపు పొందారు. గత కొంత కాలంగా షేక్‌పేట్ మారుతీనగర్‌లో ఉంటున్న ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం సాయంత్రం బంజారిదర్వాజా సమీపంలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడి మృతి

నాంపల్లి: ఉస్మానియాలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందారు. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..సుమారు 38 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని యువకుడు నాంపల్లిలోని యూసుఫియన్ దర్గా సమీపంలో బిచ్చం ఎత్తుకుంటూ జీవించేవాడు. ఈ నెల 12న అతడు అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడు చికిత్స నిమిత్తం ఉస్మానియాలో చేరాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

22న ఉచిత లీగల్ ఎయిడ్ క్లినిక్

నాంపల్లి: బజ్మే కష్ఠాన్ లిటరరీ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న లీగర్ ఎయిడ్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, న్యాయవాది మహ్మద్ అసద్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మల్లేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. అఫ్జల్ సాగర్ మహమూద్ ఆసుపత్రి సమీపంలోని మదీనా టవర్ మూడవ అంతస్తులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 8 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. లీగల్ నోటీస్, గిఫ్టడీడ్, సేల్ డీడ్, వీల్‌డీడ్, పార్టీషన్ సూట్, జీపీఏ, మెయింటెనెన్స్, మెటర్నటీ బెనిఫిట్స్, డొమెస్టిక్, డైవర్స్ ఖులా, సర్వీస్ మ్యాటర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులకు సంబంధించి న్యాయ సహాయం చేస్తారని తెలిపారు. వివరాలకు 99596 72740లో సంప్రదించాలని సూచించారు.

మ్యాన్‘హెల్స్’

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- సమస్య పరిష్కరించాలంటున్న స్థానికులు



గౌలిపురా-లలితాబాగ్ వెళ్లే ప్రధాని రహదారి దుస్థితి





లాల్‌పాషా మసీదు చౌరస్తాలో..

గౌలిపురా: జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల నిర్వహణ, నిర్లక్ష్యంతో గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో మ్యాన్‌హోళ్లకు పైకప్పులు పలిగిపోయి లోపలికి కుంగిపోయి ప్రమాదంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు స్థానికులు కట్టెలను ఏర్పాటు చేశారు. లాల్‌దర్వాజా పంచముఖి హనుమాన్ దేవాలయం సమీపంలోని లాల్‌పాషా మసీదు చౌరస్తా, గౌలిపురా నుంచి లలితాబాగ్‌కు వెళ్లే ప్రధాని రహదారిలో ఇలా పలు మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదటంచున ఉన్నాయి.

దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించండి..



మ్యాన్‌హోళ్ల నిర్వహణను జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. ఈ దారిలో రాకపోకలను సాగించలేకపోతున్నాం. ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నాం. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించండి.

– వడపల్లి సుధ, పంచముఖి హనుమాన్ బస్తీ

వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు..



గౌలిపురా నుంచి లలితాబాగ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో చాలా ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు పగిలిపోయి, కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వీటి నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– వై.సంతోష్, సర్దార్ పటేల్‌నగర్

డీఈఓ హైదరాబాద్ క్రికెట్ టీమ్ విజయం



అబిడ్స్: 11వ స్పోర్ట్స్ మీట్ పోటీలలో ఉస్మానియా మెడికల్ కాలేజ్ కోఠి మెడికల్ టీమ్‌పై డీఈఓ హైదరాబాద్ క్రికెట్ టీమ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేత క్రికెట్ టీమ్ క్యాప్టన్ కేఆర్. రాజ్‌కుమార్ మాట్లాడుతూ..తమ ఉద్యోగులంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేందుకు టీఎస్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి కోసం వారు చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ క్యాప్టన్ ఎం.భాస్కర్, సభ్యులు అఖిల్, హజరుల్లాఖాన్, మహమూద్ అలీ, హజర్, ఇర్ఫాన్, విక్రమ్, ప్రకాష్, కర్ణాకర్, యోగి, విక్రమ్‌కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నగరం అంధకారంగా మారింది’



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే నగరం అంధకారంగా మారిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం గౌలిగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని తెలిపారు. స్ట్రీట్‌లైట్లు మరమ్మతు చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ జోక్యం చేసుకొని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్, నరేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, విజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘పెనుగొండ’కు అవార్డు రావడం హర్షణీయం

చార్మినార్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడంపై హైదరాబాద్ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ అంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నూజండ్ల మండలం చెరువు కొమ్ముపాలెంలో జన్మించారని, గుంటూరులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్నారన్నారు. వీరు 1972 నుంచి అరసంలో అనేక బాధ్యతలు నిర్వహించి, 2023లో అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారన్నారు. 1972లో సమిధ అనే కవితతో రచన ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. వీరు రచించిన దీపిక పుస్తకానికి పురస్కారం లభించడం అభ్యుదయ రచయితల సంఘానికి గర్వకారణమన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి



నిహారిక

యాకుత్‌పురా: అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని చార్మినార్ తహసీల్దార్ కే. నిహారిక పేర్కొన్నా రు. డబీర్‌పురాలో మండల కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల కోసం ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆర్‌డీఓ కార్యాలయం నుంచి మంజురైన చెక్కులను ప్రతి మూడు నెలలకోసారి స్థానిక ఎమ్మెల్యేతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఇటీవల మంజురైన షాదీముబారక్ పథకానికి చెందిన 534, కల్యాణలక్ష్మి పథకానికి చెందిన 07 చెక్కులను లబ్ధిదారులకు యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ చేతుల మీదుగా పంపిణీ చేశామని ఆమె తెలిపారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన నాయకుల అరెస్ట్



సంతోష్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా తెలంగాణ మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాల మహానాడు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పౌష్టికాహారం అందించాలి

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. ఈ నెల 21న తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. మనబడిలో ఆహారోత్సవం పేరుతో పౌష్టికాహారంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు



విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో గురువారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సైంటిస్ట్, స్పీకర్ దయాకర్‌రావు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.గంగాధర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.మధుకర్, ఎస్‌పీఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు కె.మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్, ఆలంగిరి రేణుకా, మాసూమ్‌అలీతో పాటు యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల అందజేత



గుర్తింపు కార్డులను అందజేసిన పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నారాయణ

చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో అమ్మ ఆదర్శ పాఠశాల అనే కార్యక్రమం ద్వారా చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వ పాఠశాలను సుందీకరించింది. పాఠశాలకు అవసరమైన మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, పాఠశాలకు పెయింటింగ్, విద్యార్థినీ, విద్యార్థులకు నూతన ఫర్నీచర్‌ను అందించి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నారు. పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాలకు మొట్టమొదటిసారిగా విద్యార్థులకు గుర్తింపు కార్డులు ఉండాలనే దృఢ సంకల్పంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.నారాయణ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ డిప్యూటీ ఐఓఎస్ ఎస్.లక్ష్మణ్ సింగ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీను నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెల్డింగ్ వర్క్‌షాపులో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వెల్డింగ్ వర్క్‌షాప్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మాదన్నపేట్ ఈద్గా సమీపంలోని ఓ వెల్డింగ్ వర్క్‌షాపులో గురువారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మలక్‌పేట్, మొఘల్‌పురా, చాంద్రాయణగుట్ట అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో షాపు మొత్తం కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మహ్మద్ అంజాదుల్లా ఖాన్

యాకుత్‌పురా: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంతో ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అంజాదుల్లా ఖాన్ అన్నారు. యాకుత్‌పురా ఈస్ట్ చంద్రనగర్‌లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించిన బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆయన నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈస్ట్ చంద్రనగర్‌లో నివాసముండే జమీర్, షేహనాజ్ అహ్మదీ దంపతుల ఇంట్లో ఈ నెలా 17న రాత్రి ఒంటి గంట సమయంలో ఫ్రిడ్జ్ నుంచి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పాడి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన జమీర్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పూజల్లో శ్రీకాంత్‌చారి తదితరులు



పూజల్లో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: బంజారి దర్వాజాకు చెందిన బి.శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉప్పర్ బస్తీలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో అంబటి క్రాంతిసాగర్ ఆధ్వర్యంలో అయ్యప్ప పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో గుడిమల్కాపూర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు తరలించారు. రాచకొండ గోపిసాగర్, గురుస్వామి వైద్యనాథ్, ఆనంద్‌గురుస్వాములు పాల్గొన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి



నిరసన కార్యక్రమంలో సత్యనారాయణ తదితరులు



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు నర్సయ్య, సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ఏంజే మార్కెట్ చౌరస్తాలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. జనసమితి నాయకులు బట్టా రాంచందర్, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, హన్మంత్‌గౌడ్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ నుంచి..

గోల్కొండ: కేంద్ర మంత్రి అమిత్‌షా దళిత వ్యతిరేకి అని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ దళిత నాయకుడు డి.సత్యనారాయణ అన్నారు. అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వాఖ్యలపై ట్యాంక్‌బండ్ వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమానికి షేక్‌పేట్ నుంచి దళిత సోదరులు, అంబేడ్కర్ సానుభూతి పరులతో కలిసి తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధినాయకత్వం దళిత వ్యతిరేకి అని ఆయన అన్నారు.

హైకోర్టు గేటు వద్ద న్యాయవాదుల నిరసన..

దూద్‌బౌలి: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ తిరుపతి వర్మ డిమాండ్ చేశారు. గురువారం హైకోర్టు గేటు వద్ద అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా న్యాయవాదులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటాలను ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం..

చార్మినార్: కేంద్ర హోం మంత్రి అమీత్ షా వ్యాఖ్యలను తప్పుపడుతూ గురువారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్లో అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానపరిచే వ్యాఖ్యలు చేసినందుకు తక్షణమే ఆయనతో పార్లమెంటులో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. గడ్డం సత్యనారాయణ, సాప కృష్ణ, ఆలంపల్లి నరేందర్, ప్రేమ్ కుమార్, సుధాకర్, శివ (డల్లు) నరసింహ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



అమిత్‌షా దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలి..

గౌలిపురా: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ అన్నారు. గురువారం లాల్‌దర్వాజా మోడ్ నెహ్రూ విగ్రహం వద్ద చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. బుంగ శివ కుమార్, చంద్రశేఖర్, దినేశ్ బిడ్ల, కె.సురేశ్ బాబు, డల్లు శివ, శ్రీకాంత్ కాగడ, నరసింహ, అస్లాం, బిలాల్ పాల్గొన్నారు.